క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



డోర్నకల్: అసెంబ్లీ స్థానానికి బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు ఎమ్మెల్యే రెడ్యానాయక్ పేరు ప్రకటించడాన్ని హర్షిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు ఉగ్గంపల్లిలో ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నున్నా రమణ, మార్కెట్ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హరిప్రియకు ఘన స్వాగతం



బయ్యారం: బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నియామకమైన తరువాత మొదటిసారిగా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం సరిహద్దులోకి వచ్చిన ఎమ్మెల్యేకు హరిప్రియకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రాజేందర్, ఇల్లందు ఏఎంసీ చైర్మన్ హరిసింగ్, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు గణేష్, లక్ష్మణ్‌నాయక్, పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ



కురవి: మండల కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, ఇన్‌వాయిస్‌లు, పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మంజుఖాన్ మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల యజమానులు, డీలర్లు అధీకృత డీలర్ల వద్ద (సెంట్రల్ లైసెన్స్ ఉన్న హోల్‌సేల్ డీలర్ల వద్ద), నేరుగా కంపెనీ వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



గూడూరు: ఆశ్రమంలో ఉండే విద్యార్థులు ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని హోమియో వైద్యురాలు ఆర్.రజిత అన్నారు. మండలంలోని సీతానగరంలో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గంగూనాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరం

మరిపెడ రూరల్: మరిపెడ మండలం స్టేజితండా గ్రామ పంచాయతీ పరిధిలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బీసు మల్లేష్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర, జుజ్జూరి ఉపేంద్ర, ఎంపీటీసీ అమర్‌సింగ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు

గార్ల: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం గార్లలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా మైసా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా బోయిని అంజయ్య, ఉపాధ్యక్షుడిగా మైసా అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు డైరెక్టర్లుగా అంజయ్య, తిరుపతిదాసు, వీరస్వామి, వెంకన్న, లక్ష్మీనారాయణ, పూర్ణయ్యలను ఎన్నుకున్నారు.

రేవంత్ రెడ్డిని కలిసిన అంజయ్య



మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య మంగళవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



మండల కేంద్రంలో బొడ్రాయి సెంటర్ నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్

చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగు సమీపంలో కొన్ని రోజులుగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారుల అనుమతి లేకపోయినా అక్రమార్కులు ట్రాక్టర్లతో జోరుగా రవాణా చేస్తున్నారు. ఈ దందా సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని బొడ్రాయి సెంటర్ వద్ద స్థానికులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఊరి మధ్య రహదారిలో చిన్నపిల్లలు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు, మహిళలు సంచారం చేస్తుంటారు. ఇసుక ట్రాక్టర్లు ఊరి మధ్య నుంచి వస్తే ప్రమాదాలు జరుగుతాయని పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేయకుండా వదిలిపెట్టడం వెనుక ఆంతర్యం ఏంటని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మహబూబ్ అలీని వివరణ కోరగా ఆకేరు వాగునుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మహబూబాబాద్: పెండింగ్ స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ హాస్టల్ వసతి కల్పించాలన్నారు. స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మనోజ్, అనిల్, రాంబాబు, కృష్ణ , వంశీ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

కేసముద్రం: కేసముద్రం మండల కేంద్రంలో సమయం లేకుండా విద్యుత్ కోతలు విధించడం ద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రాధాస్వామి మందిరాన్ని పరిరక్షించాలి

కేసముద్రం: కేసముద్రంస్టేషన్‌లో గల రాధాస్వామి మందిరాన్ని పరిరక్షించాలంటూ మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాధాస్వామి జనరల్ సత్సంగ్ హనుమకొండ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఠాకూర్ నారాయణసింగ్, ఠాకూర్ మన్మోహర్‌సింగ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని డీఎస్‌ఆర్‌జెండాల్ తండాకు చెందిన బానోతు సోమన్నకు రూ.లక్ష , మూలమర్రితండా గ్రామానికి చెందిన భూక్య సుజాతకు రూ.30,500 విలువ చేసే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బీఆర్‌ఎస్ యువ నాయకుడు భరత్‌కుమార్ మంగళవారం లబ్ధిదారులకు అందజేశాడు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో నేడు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పర్యటిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న మంగళవారం తెలిపారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కురవి: అక్రమంగా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సీరోలు ఎస్సై రమాదేవి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల సమీపంలో సీరోలుకు చెందిన గరిపల్లి భాస్కర్, ప్రొద్దుటూరి సంతోష్, గరిపెల్లి శ్రీనివాస్ తమ టూ వీలర్స్ మీద అక్రమంగా తరలిస్తుండగా వారిని పట్టుకుని వారి వద్ద నుంచి తొమ్మిది బస్తాల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకొని, మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతి నిర్మాణానికి మూలం జానపద కళలు



ర్యాలీలో జానపద కళాకారులు

తొర్రూరు: జాతి నిర్మాణానికి మూలం జానపద కళలు అని జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కెర నాగేంద్రాచారి అన్నారు. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలో కళాకారులచే ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదురుగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నాగేంద్రాచారి మాట్లాడుతూ.. ప్రకృతిలో విహరిస్తూ ప్రజా జీవితంలో మమేకమైన శ్రమ జీవుల కళ జానపదమని, ఈసంస్కృతి వారసత్వాన్ని కాపాడుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగుల శ్రీనివాస్, మండల అధ్యక్షులు బచ్చలి వెంకన్న, కార్యదర్శి గూడెల్లి బిక్షం, కళాకారులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న సుధాకర్

తొర్రూరు: బ్రాహ్మణులకు రాష్ట్రంలోని అన్నిపార్టీలు 10 చొప్పున ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, బ్రాహ్మణ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో బ్రాహ్మణ ప్రతినిధుల నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం నియోజకర్గ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కొల్లావజ్జుల రమేష్‌శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఏడునూతుల ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఓలేటి వెంకటాచార్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగు నవీన్‌శర్మ, ప్రతినిధులు తమ్మెర విశ్వేశ్వరరావు, వీరభద్రరావు, శ్రావణ్‌శర్మ, రఘు శర్మ, ఓలేటి లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

సమాజ సేవకు పాటుపడుతాం..



ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గూడూరు: మానవ అక్రమ రవాణా, మహిళలపై జరిగే వేధింపులు, బాల్యవివాహాల అరికట్టండంతోపాటు సమాజసేవకు పాటుపడుతామని మండల అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేశారు. మండలంలోని బొద్దుగొండ రైతు వేదికలో హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మానవఅక్రమ రవాణా, పలు చట్టాలపై మంగళవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. క్యాక్రమంలో ప్రజ్వల సంస్థ కోఆర్డినేటర్ చంద్రయ్య ఐపీసీ, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, శ్రావ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనిత, జ్యోతి, కళావతి, రాజేశ్వరి, విజయకుమారి, చైతన్య పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 29వ తేదీన చలో హైదరాబాద్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పర్వత కోటేష్, హలావత్ లింగ్యా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా జరిగే మహాధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్మిక వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచేలా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి జబ్బార్, జిల్లా నాయకులు లక్ష్మయ్య, కృష్ణ, సురేష్, రామ్మూర్తి, లింగయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

గార్ల: గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి ప్రభుత్వం నిబంధనలు సడలించి, ఇంటి స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు లేని వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో పెద్దవెంకటేశ్వర్లు, హరి, గిరిప్రసాద్, ఇమ్మడి గోవింద్, రమ, నాగమణి, ఉపసర్పంచ్ మహేశ్వరరావు, ఈశ్వర్‌లింగం, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరిక



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

తొర్రూరు రూరల్: మండలంలోని అరిపిరాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీలో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను స్వాగతిస్తూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లోకి వలసలు కడుగుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో వీరసోములు, పర్శరాములు, గోపయ్య, రమేష్, నర్సయ్య, ప్రదీప్‌కుమార్, దిలీప్, రాంమూర్తి, మధుకర్, భవాని, సంజీవ, నరేష్, అశోక్, మల్లయ్యతోపాటు మరికొంత మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రావుల మమతరెడ్డి, ఉపసర్పంచ్ రాజు పాల్గొన్నారు.

మౌనం వీడి పోరాటాలకు సిద్ధం కావాలి



పెద్దవంగర: సభ్యత్వ నమోదులో పాల్గొన్న సంఘం నాయకులు

పెద్దవంగర: ఉపాధ్యాయులు మౌనం వీడి పోరాటాలకు సిద్ధం కావాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించారు. మండల అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి దేవేందర్ నాయక్, చింతల సురేష్, వల్లాల శ్రీనివాస్, అంజనేయులు, వెంకటేశం, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదు

దంతాలపల్లి: విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా విద్యారంగ సమస్యలు ఏమాత్రం పట్టించుకోని ప్రభుత్వం జరుగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కల్లబొల్లి మాటలతో మళ్లీ మోసం చేయాలని చూస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, శ్రీనివాస్, యాకయ్య, మురళి పాల్గొన్నారు.

రెగ్యులర్ ఎంఈఓలను నియమించాలి

నెల్లికుదురు: రెగ్యులర్ ఎంఈఓను తక్షణమే నియమించాలని టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, ఉదయ్ కిరణ్, రవి, రాజు, గోవర్ధన్ పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న శ్రీరాములు

కురవి: జిల్లాలో స్కూల్ గేమ్స్‌ను విజయవంతం చేయాలని ఏసీజీ మందుల శ్రీరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 10వ తేదీలోపు మండలాలు, 20వ తేదీలోపు జోనల్, 30వ తేదీ లోపు జిల్లా స్థాయి క్రీడలు నిర్వహించాలని ప్రణాళిక తయారు చేసి డీఈఓకు పంపించాలని నిర్ణయించారు. జిల్లా ఎస్‌జీఎఫ్ఐ సెక్రటరీ జ్యోతి ఆధ్వర్యంలో క్రీడల ప్రణాళిక తయారు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయక్, శ్యాంబాబు, మోహన్ నాయక్, నాగయ్య, సునీల్, విజయ్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న భూదాన్ ముర్ము

నర్సింహులపేట: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఒడిషా బీజేపీ ఎమ్మెల్యే భూదాన్ ముర్ము అన్నారు. బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ డోర్నకల్ నియోజకవర్గ నాయకులు ప్రభాస్ నాయక్, మహేష్, పూర్ణచందర్, దేవిక, కృష్ణ, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముంజాల రాజేందర్‌గౌడ్, బుడిగె భద్రసేనాగౌడ్ మంగళవారం పిలుపునిచ్చారు. సమావేశంలో గడ్డం సమ్మయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్, వీరభద్రంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం



తొర్రూరు: ఓటింగ్ శాతం పెంపులో వృద్ధులే కీలకమని జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు. కార్యక్రమంలో డీటీ శ్రీలత, ఎంపీఓ గౌస్, ఆర్ఐ ప్రవీణ్‌రెడ్డి, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

గార్ల: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు గార్ల పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్‌ను సర్పంచ్ అజ్మీర బన్సీలాల్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కందునూరి మహేశ్వరరావు, కార్యదర్శి కుమారస్వామి, బిల్ కలెక్టర్ కిషోర్, పాల్గొన్నారు.

ఎరుకల సంఘం మండల అధ్యక్షురాలిగా శోభ



దంతాలపల్లి: ఎరుకల సంఘం మండల అధ్యక్షురాలిగా అంగడి శోభ ఎన్నికయ్యారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో అంగడి శోభను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు నడిగడ్డ శైలజ తెలిపారు.

రాజకీయ లబ్ధి కోసమే ఎస్టీ వర్గీకరణ

పెద్దవంగర: రాజకీయ లబ్ధికోసమే ఎస్టీ వర్గీకరణ ప్రస్తావనను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని గిరిజన నాయకులు ఎంపీటీసీ బానోతు రవీందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గిరిజన సర్పంచ్‌లు పటేల్ నాయక్, రాజేందర్ నాయక్, భీమా నాయక్, నాయకులు గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా 'గృహలక్ష్మి' ఎంపిక

కురవి: గృహలక్ష్మి పథకం ఎంపికలో బీఆర్‌ఎస్ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరగాల్సిన ఉండగా, మండల కేంద్రంలో రహస్యంగా లబ్ధిదారుల ఎంపిక తయారు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన చాట్ల భద్రమ్మ అనారోగ్యంతో మృతిచెందగా కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబానికి మంగళవారం రూ. 8,500 ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ నూనావత్ రమేష్‌నాయక్, ఎంపీటీసీ కత్తి స్వామి, ఎండి.యాకూపాష, సతీష్‌గౌడ్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాళి

మరిపెడ రూరల్: మండలంలోని బాల్నిధర్మారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బాల్ని రామచంద్రారెడ్డి (55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట చైర్మన్ నవీన్, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

పరామర్శ

కురవి: ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన మహబూబాబాద్‌లోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నాయకులను ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంగళవారం పరామర్శించారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం ఎలక్షన్ అధికారులు ఎం.శ్రీనివాస్, అజయ్ తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా దాసరి లింగస్వామి, ఉపాధ్యక్షులు శశికుమార్, కార్యదర్శి గణేష్, డైరెక్టర్లు రవి, మణికంఠ, వెంకన్న, చంద్రకాంత్, శరత్‌కుమార్, సుధాకర్, అఖిల్ ఎన్నికయ్యారు.

పుట్టకోటలో తాగునీటి ఎద్దడి



గార్ల: మండల కేంద్రమైన గార్లలోని పుట్టకోట బజారు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా సక్రమంగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో గార్ల రక్షిత మంచినీటి పథకం తాగునీటి సరఫరా బాగుండేదని, మిషన్ భగీరథ పథకం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. కొత్తగా మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడంతో ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వసుంధరను 'సాక్షి' వివరణ కోరగా పుట్టకోట బజారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, గ్రామ పంచాయతీ పాత నల్లాల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు.